దుక్కులు సిద్ధం .. సాగుకు సన్నద్ధం

- తొలకరి పలకరించె.. పుడమి పులకించె
- అకాల వర్షాలతో ఇప్పటికే చల్లబడిన వాతావరణం
- డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా జల్లులు
- విత్తన కేటాయింపుల్లో సర్కార్ విఫలం


నేలను దుక్కి చేస్తున్న రైతన్న


ఆర్ఎస్‌కేలకు చేరుతున్న రాయితీ విత్తన వేరుశనగ

రాయదుర్గం: జూన్ 5 తర్వాత ప్రవేశించాల్సిన నైరుతి రుతు పవనాలు ఈ ఏడాది ముందస్తుగానే పలకరించాయి. ఇప్పటికే అకాల వర్షాలతో వాతావరణం చల్లబడింది. రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గుముఖం పట్టి చలి గాలులు వీస్తున్నాయి. అంతే వేగంగా రైతులు దుక్కులు సిద్ధం చేసి.. సాగుకు సన్నద్ధమయ్యారు. ఆదివారం రోహిణి కార్తె ప్రారంభంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం ఆ తర్వాత ఉరవకొండ నియోజకవర్గాల్లో వర్షాధారంగా వేరుశనగ పంట అత్యధిక విస్తీర్ణంలో సాగులోకి రానుంది. మూడు నియోజకవర్గాల్లోనూ సాధారణ సాగు విస్తీర్ణం 2,90,473 హెక్టార్లు కాగా, 1,74,179 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. మెజార్టీ సాగు వేరుశనగ కాగా, ఆ తర్వాత కంది, ఆముదం, పత్తి, సజ్జ, ఉలువ, పొద్దు తిరుగుడు ఉంటుందని అధికారులు అంచనా. అయితే రైతు అవసరానికి తగ్గట్టుగా కూటమి సర్కార్ విత్తన కేటాయింపులు చేయలేదు. మూడు నియోజకవర్గాల్లోని 15 మండలాలకు సుమారు 50 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమైతే 31,512 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ అందిస్తున్న కూటమి సర్కార్ ధరలు నిర్ణయించింది. కే-6 తో పాటు కొత్తగా టీసీజీఎస్-1,694, కదిరి- లేపాక్షి (కే-1812) రకాలు పంపిణీ చేసేలా ప్రణాళికలు చేపట్టింది. ఎక్కువ శాతం రైతులు కే-6 వైపే మొగ్గు చూపుతున్నారు. కే-6, టీసీజీఎస్ 1694 రకాలు క్వింటా పూర్తి ధర రూ.9,300 కేటాయించారు. అందులో 40 శాతం రాయితీ రూ.3,720, రైతు వాటాగా రూ.5,580 చెల్లించాల్సి ఉంటుంది. కదిరి లేపాక్షి రకమైతే పూర్తి ధర 8,200, అందులో రూ.3,280 రాయితీ పోనూ రూ.4,920 రైతు చెల్లించాలి. ఒక్కో రైతుకు మూడు బస్తాలు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయశాఖ ప్రకటించింది. రైతు అవసరాల మేరకు విత్తన కేటాయింపులు లేక బయటి మార్కెట్‌లో తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

వాతారణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఖరీఫ్ పనులు ఎటుచూసినా ఊపందుకున్నాయి. ముందస్తు వర్షాలు ఊరిస్తున్నా .. దానికి తగ్గట్టుగా విత్తనాలు, పెట్టుబడి సాయం అందించడంతో కూటమి సర్కార్ విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఈ సీజన్ ఆరంభానికి ముందే రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 ల్లో రూ.5500 రైతు ఖాతాకు జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప చేసిందేమీలేదనిపిస్తోంది. దీంతో సాగు గట్టెక్కడం సాధ్యమేనా? అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో విత్తన పంపిణీ

రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్లు మొదలుపెడతాం. ఆ తర్వాత విత్తన పంపిణీకి శ్రీకారం చుడతాం. రాయదుర్గం డివిజన్ వ్యాప్తంగా 9,600 క్వింటాళ్లు కే-6, టీసీజీఎస్ 1694 రకం 600 మొత్తం 10,200 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుతాం. రైతు అవసరాన్ని బట్టి విత్తన కాయలు తెప్పిస్తాం. కళ్యాణదుర్గంలో కే-6 12265, కే-1812 రకం 400, టీసీజీఎస్-1694 రకం 200 మొత్తం 14,462 క్వింటాళ్లు, ఉరవకొండలో కే-6 6250, కే-1812 రకం 300, టీసీజీఎస్- 1694 రకం 300 మొత్తం 6,850 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధం చేసినట్టు ఆయా నియోజకవర్గాల ఏడీఏలు యల్లప్ప, పద్మజ తెలిపారు. – లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

క్లుప్తంగా

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట


కిశోరీ వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. మంగళవారం కూడేరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడారు. ఏటీఎం కార్డుల పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని సూచించారు. లోన్‌యాప్స్‌కు ఆకర్షితులు కావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు రాజేశ్వరి , అరుణ, మహిళా పోలీసులు పుష్పా, వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కళావతి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతును ఆదుకోవాలి

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలోని రాకెట్ల గ్రామ పరిధిలో మూడు రోజుల క్రితం హంద్రీనీవా కాలువకు గండి కొట్టడంతో గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు చెందిన 5 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట దెబ్బతినింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, ఎంపీపీ వెలిగొండ నరసింహులు, రైతు విభాగం అధ్యక్షుడు మోపిడి సిద్దప్ప క్షేత్రస్థాయిలో పంట పొలాన్ని మంగళవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ కాలువకు గండి కొట్టే సమాచారాన్ని కాంట్రాక్టర్ రైతుకు ముందుగా తెలపకపోవడం సరికాదన్నారు. బాధిత రైతును కాంట్రాక్టర్ ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి


మల్లప్పకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: మండలంలోని బెణికల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ మల్లప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమన, పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ రామలింగారెడ్డి, సంగప్ప, భీమిరెడ్డి, కురుబ లోకేష్, చెన్నయ్య, హనుమంతు, శివశంకర్, ఎర్రిస్వామి తదితరులు మల్లప్ప మృతదేహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి


చిక్కీరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండివానిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త, మాజీ డీలర్ కేఎల్ చిక్కీరప్ప గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు చిక్కీరప్ప మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జిల్లా అనుబంధ సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, మంజు,జిల్లా మాజీ కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లోకేష్, మాజీ ఎంపీపీ మహదేవప్ప, నాయకులు గంగాధర, ఎల్లప్ప, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించండి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతి

కణేకల్లు: మండు టెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ఉమెన్) జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని యర్రగుంటలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల వద్ద ఆమె ఉపాధి హామీ కూలీలను కలిశారు. కనీస సౌకర్యాల ఏర్పాటుపై ఆమె కూలీలను ఆరా తీశారు. పనులు జరిగే చోట ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేవని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని కూలీలు వాపోయారు. ఈకార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల సహాయకార్యదర్శి ముల్లా సర్మస్, నాయకులు హసీనా, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న సర్పంచు మల్లెల జగదీష్

వజ్రకరూరు: కిశోర బాలికల్లో మానసిక, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే కిశోరి వికాసం లక్ష్యమని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. మంగళవారం చాబాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. సర్పంచు మల్లెల జగదీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మా తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్ మాట్లాడుతూ కిశోర బాలికలు అవగాహన కార్యక్రమాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మా , ఎమ్మెస్‌కే అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త సోమేశ్వరి, ఆయాలు నాగమ్మ, రాజేశ్వరి, ప్రభావతి, రాధా, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలి

శెట్టూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. దీక్షలో అనుంపల్లి, యాటకల్లు గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు లింగప్ప, నాయకులు ఈరన్న , మారెన్న, రామన్న, పాలాక్షి, సురేష్, మహిళా సంఘ సభ్యులు ఆనంద్, అనుమక్క,గంగమ్మ, మారెక్క, నరసక్క, తిప్పక్క, నాగమ్మ, వరలక్ష్మి, సీబీటీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలు మృతి


షబానా కౌసర్ (ఫైల్)

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడకెర ప్రాథమిక పాఠశాల ఎస్జీ టీచర్ షబానా కౌసర్ (38) బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అయితే ఈమె ఇటీవల బిడ్డకు జన్మనిచ్చింది. హైబీపీతో ఆస్పత్రిలో చేరింది. మంగళవారం బ్రెయిన్ డెడ్ అయ్యినట్లు ఎంఈఓ ఓబుళపతి తెలిపారు. ఈమె విధుల పట్ల అంకిత భావంతో పనిచేసేదన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, అధికారులు


యోగా చేస్తున్న అధికారులు

- ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్డీఓ వసంతబాబు చెప్పారు. మంగళవారం అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ యోగాంధ్ర-2025 మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీ సర్కిల్‌కు చేరుకుని ప్రజలకు యోగా ఉపయోగాలను తెలియజేశారు. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా చాలా అత్యంత కీలకమన్నారు. ఆరోగ్యంగా జీవించాలంటే యోగా తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బొమ్మనహాళ్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ యుగేందర్, ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాను అభ్యసిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ జయరాములు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

ఉరవకొండ రూరల్: ప్రతి ఒక్కరికీ దినచర్యలో యోగా భాగం కావాలని తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు యోగా ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉనికి కోసం విమర్శలు చేయడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: రాజకీయ ఉనికి కోసం మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్యను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విమర్శించడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు హనుమంతురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటం ఉండటాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తప్పుపడుతూ జెడ్పీ సీఈఓతో వాగ్వాదం చేసిన విషయం విదితమే. అయితే ఎంఎస్ రాజు జిల్లా స్థాయి అధికారిపై ప్రభుత్వ కార్యాలయంలో వాగ్వాదం చేయడం సరికాదని మాజీ ఎంపీ తలారి రంగయ్య ఖండించారు. దీంతో ఎంఎస్ రాజు మాజీ ఎంపీ రంగయ్యను తీవ్ర స్థాయిలో విమర్శించడం సరికాదని కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. టీడీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు న్యాయం చేయాలని, సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, అలాంటి నాయకుడిని విమర్శించే స్థాయి వారికిలేదన్నారు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు మంచి పాలనతో చేరువ కావాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి దాదా ఖలందర్, యూత్ వింగ్ అధ్యక్షులు చరణ్, నాయకులు షెక్షా, దొణతిమ్మ, వెంకటేశులు, శ్రీకాంత్, ప్రకాష్ అంజి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన నీటి తొట్టెల నిర్మాణాలు


కూడేరు: తిమ్మాపురంలో నిర్మాణంలో ఉన్న పశువుల నీటి తొట్టె

కూడేరు: మండలంలో నీటి తొట్టెల నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. మండలానికి ఉపాధి హామీ పథకం కింద 31 పశువుల నీటి తొట్టెలు మంజూరయ్యాయి. అందులో అరవకూరులో రెండు, చోళసముద్రంలో మూడు, తిమ్మాపురంలో మూడు, ఇప్పేరులో ఐదు, మరుట్లలో ఆరు, కూడేరులో ఆరు, జల్లిపల్లిలో రెండు, కొర్రకోడులో నాలుగు, కడదరకుంటలో రెండు తొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కో నీటి తొట్టెకు రూ.40వేలు వెచ్చించారు. ఈ నెల 1న డ్వామా పీడీ సలీం బాషా కూడేరులో తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. జూన్ నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయించాలని లక్ష్యం విధించారు. కానీ కింది స్థాయి ఉద్యోగులు శ్రద్ధ చూపకపోవడంతో నీటి తొట్టెల నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. మంగళవారం నాటికి ఏడు తొట్టెలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా ఆరింటికి అధికారులు మార్కింగ్ ఇచ్చారు. మిగిలిన గ్రామాల్లో నిర్మాణపు పనులు ఇంకా ప్రారంభించలేదు.

నవయుగ వైతాళికుడు 'కందుకూరి'


కందుకూరి వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: సంఘసంస్కర్తగా, కవిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన కందుకూరి నవయుగ వైతాళికుడని వక్తలు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ వేదికగా తెలుగు వెలుగు సామాజిక సాహిత్య సంస్థ వారు మంగళవారం కందుకూరి 106వ వర్ధంతి సందర్భంగా సాహితీ సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ రచయితలు దాసన్నగారి కృష్ణమూర్తి, నాగరాజు, డాక్టర్ అంకె రామలింగయ్య, కోగిర జయచంద్ర తదితరులు కందుకూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు షేక్ రియాజుద్దీన్, సుంకర రమేష్, శేషాద్రిశేఖర్ పరమేశ్వరరావు, విజయభాస్కరరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో జిల్లా పరిషత్ హెచ్ఎంల ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగిందని రిజర్వేషన్ ఉద్యోగుల సంఘం, పరిరక్షణ కమిటీ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో నిరసన తెలియజేశారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న మాట్లాడుతూ జీఓ 2 ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా హెచ్ఎంల పదోన్నతులు ఇవ్వాలని చూస్తున్నారన్నారు. సీనియార్టీ జాబితాలోని స్కూల్ అసిస్టెంట్లను వెరిఫికేషన్ కోసం పిలిచిన విద్యాశాఖ ఎస్సీ, ఎస్టీ టీచర్ల గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ జీవీ ఉజ్వల్, ఎస్సీ ఎస్టీ ఫోరం రామాంజనేయులు, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నరేష్ పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి


పూజలందుకున్న నేమకల్లు ఆంజనేయస్వామి

వీరభద్రస్వామికి అమావాస్య పూజలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వీరభద్రస్వామికి మంగళవారం అమావాస్య పూజలు జరిగాయి. వీరభద్రస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమం, ఆకుపూజ నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు మంగళవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష..!

- గుమ్మఘట్ట మండలం పైదొడ్డిలో ఇటీవల రైతు నాయకుల పాలయ్య మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. స్టార్టర్ బాక్సును ముట్టుకోగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు కోల్పోయాడు.
- గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలో బోయ మహాలక్ష్మి అనే వివాహిత ఇటీవల మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఇలా ఈ రెండు చోట్లే కాదు వర్షాకాలం వచ్చిందంటే చాలు చాలాచోట్ల విద్యుత్ షాక్‌తో మరణిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.


బోరుబావుల కింద సాగు చేసిన వరినారు

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద జాగ్రత్త
- స్టార్టర్లు, విద్యుత్ లైన్లతో స్వీయ మరమ్మతులు చేయొద్దు
- హెచ్చరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు


మోటారు స్విచాన్ చేస్తున్న రైతు ఎర్రిస్వామి

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రుతు పవనాలు రాకతో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్నడం, బోర్ల కింద పంటమడులు సిద్ధం చేయడం, వరినారు పెంచడం, మొక్కజొన్న, పత్తి తదితర విత్తనాలు వేయడం లాంటి పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో వర్షాలతో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. రైతులు స్టార్టర్ బాక్సుల వద్దకు వెళ్తుంటారు. మోటార్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నారు. అలాంటి వారి సంఖ్య ఏటేటా పెరడం కాస్త ఆందోళన కలిగించే అంశం.

స్టార్టర్ల వద్ద జాగ్రత్త..

- స్టార్టర్‌కు వర్షం నీరు తగలకుండా చెక్కపెట్టేలు, లేదా ప్లాస్టిక్ పెట్టేల్లో అమర్చుకుంటే ప్రమాదాలు అరికట్టొచ్చు.
- ఒక్కోసారి ఎలుకలు విద్యుత్ తీగలను కొరికి వేస్తాయి. దీంతో ఇనుప పెట్టేలకు వైర్లు తగిలి విద్యుత్ సరఫరా జరిగి ఉంటుంది. తెలిసో తెలియక రైతు ముట్టుకోగానే షాక్‌కు గురికావాల్సి వస్తోంది. ఇలాంటి సమయాల్లో జాగ్రత్త అవసరం.

కొందరు రైతులు ఏదో అనుభవం ఉన్నట్టు సొంతంగా మరమ్మతులు చేస్తుంటారు. ఇది మంచిపద్ధతికాదు. సమస్య చిన్నదైనా సరే విద్యుత్ అధికారులు లేదా దగ్గర్లో ఉండే మోటార్ మెకానిక్‌లను ఆశ్రయించుకోవడం ఉత్తమం.

సలహాలు, సూచనలు తప్పనిసరి:

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య దూరం ఎక్కువ ఉండరాదు.
- మెయిన్ లైను నుంచి త్రీఫేజ్ లాగే వైరుకు ఫ్యూజ్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

తడవని ప్రదేశంలో స్టార్టర్ బాక్సు ఉంచుకోవాలి. సరఫరాలో లోపం ఉంటే విద్యుత్ అధికారులు, మెకానిక్‌లను సంప్రదించాలి.

- ఈదురు గాలులు, వర్షాలకు ఎక్కడైనా విద్యుత్ తీగలు, స్తంభాలు విరిగినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలి. అలాంటి చోట సొంత ప్రయోగం మంచిదికాదు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యవసాయ బోర్లు, స్టార్టర్లు, విద్యుత్ తీగల వద్ద రైతులు అనేక జాగ్రత్తలు పాటించాలి. గత కొద్ది రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. పొలాలు, విద్యుత్ తీగలు తడుస్తున్నాయి. తేమ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయి. ఎల్‌టీ లైన్ నుంచి స్టార్టర్‌కు సరఫరా జరిగే వైరు నాణ్యతగా ఉండాలి. స్టార్టర్ బాక్సును చెక్క లేదా ప్లాస్టిక్ బాక్సులో అమర్చి తడిలేని ప్రాంతంలో ఉంచుకోవాలి. చిన్న నిర్లక్ష్యానికి పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సమస్య ఏదైనా తమ దృష్టికి తీసుకొస్తే ఎలా పరిష్కారించాలో చూస్తాం. అంతేకాని స్వీయపద్ధతి పాటిస్తే ప్రాణాలకే ముప్పుతప్పదు.

– బాలచంద్ర, విద్యుత్‌శాఖ ఏఈ, రాయదుర్గం